# సుబ్బులు పెళ్ళి

★

రచన :
సి. యచ్. గిరిజ.



ఆరోజు సుబ్బులుకి 6 వ పెళ్ళిచూపులు.

బాహ్య సౌందర్యాన్ని తప్ప అంతర సౌందర్యాన్ని కాంచే కళ్ళు 1 నుండి 6 పెళ్ళికొడుకుల్లో ఒక్కరికున్నా ఈపాటికి సుబ్బులు పెళ్ళి అయ్యేదే.

సుబ్బులు అందగత్తె అనలేం, అనాకారి అనలేం. చదివింది ఏడోదయినా, మనసు ఆదర్శాలపుట్ట. ఎన్నో సుప్రసిద్ధ రచయిత్రు(త)ల నవల్స్ చదివి అందలి మంచినంతా జీర్ణించుకొంది సుబ్బులు. కానీ నవల్లో హీరోలు జీవితంలో ఎక్కడా తారసపడ్డంలేదన్నదే సుబ్బులుకి సైక్లాబ్ అంత దిగులు.

ఓ పెళ్ళికొడుకు పిల్లనచ్చలేదంటే, ఒకడేమో కట్నం చాల్లేదంటాడు, ఒకడేమో (వాడు పదిసార్లు తప్పినవాడే అయినా) చదువు తక్కువంటాడు. అప్పుడు సుబ్బులుకి బలేకోపం వస్తుంది. నేనే కనుక గ్రాడ్యుయేట్ అయితే చచ్చినా పెళ్ళిచేసుకునేదాన్ని కాను, చక్కగా మంచి వుద్యోగం చేస్తూ నవల్స్ చదువుకుంటూ హాయిగా జీవితాన్ని గడిపేదాన్ని అని మనసులోనే వాపోయేది. కానీ విధి మరోలా వుండి ముచ్చటగా మూడుసార్లు ఏడులోనే కూర్చొని ఇక లాభంలేదని మానేసి ఇంట్లో కూర్చుని తల్లికి పనిలో సాయంచేస్తూ సంచారగ్రంథాలయంలో నవల్స్ చదువుతూ హాయిగా కాలం గడుపుతోంది సుబ్బులు.

ఎటొచ్చి సుబ్బులు తండ్రి పరందామయ్యగారే సుబ్బులు గురించి బాధపడుతుంటాడు. ఐదుగురి పెళ్ళి ఎలాగోలాగా చెయ్యగలిగాడు ఆరవది, ఆఖరిది అయిన సుబ్బులు పెళ్ళికూడా చేసేసి తన భారం దించుకోవాలనుకుంటున్నాడు. ఎన్నో చెప్పుల జతలు అరిగిపోయాయి (పెళ్ళికొడుకుల వేటలో) కానీ కల్యాణగడియ మాత్రం ఇంకా రాలేదు సుబ్బులుకి. అదేం విచిత్రమో గానీ ప్రతివాళ్ళు వెళ్ళినాక వుత్తరం వ్రాస్తాం అంటారు. వాళ్ళవూళ్ళో కవర్లు, కార్డులు దొరకవో ఏమోగానీ, ఒక్కళ్ళ దగ్గర నుండి వుత్తరం రాదు. అలా రెండువారాలు గడిచాక ఒకనాడు 6వ పెళ్ళికొడుకు దగ్గర నుండి కవరు అందుకున్న పరందామయ్యగారి

ఆనందం వర్ణనాతీతం. విప్పిచూడకుండానే గుర్తుంచుకొని ఉత్తరం వ్రాసినందుకే పొంగిపోయాడు. భార్యని, సుబ్బుల్ని పిలిచి గబగబా ఉత్తరం చదివి నీరసంగా కుర్చీలో కూలపడిపోయాడు. సారాంశం–పిల్ల నచ్చలేదని. అది చదివిన సుబ్బులు వ్రాదుక్తరాలైపోయింది. తండ్రి ఆవేదన చూసి తల్లడిల్లిపోయింది, "కొనుక్కునే వాళ్ళకు వస్తువు నచ్చాలీ గానీ, వస్తువుకి కొనుక్కునే వాళ్ళు నచ్చాలనే ప్రసక్తే లేదు. వీళ్ళు మనకి రాసేందేంటి? మనమే అనాలసింది, మీరెళ్ళినాక మేం ఉత్తరం వ్రాస్తామని. అలా జరక్కపోగా వాడేదో రాస్తే మన మెందుకు బాధపడాలి? వాడికి నే నచ్చాల్సిన అవసరం లేదు. మనం కట్నంఇచ్చి కొనుక్కుంటున్నాం కాబట్టి మనమె వాళ్ళ అందచందాలు చూడాలి. ఆడపిల్లల తల్లితండ్రులంతా వాడ్ని అమ్మాయికి కొనిపెడుతూ కూడా వాళ్ళ ఉత్తరాల కోసం ఎందుకు ఎదురుచూడాలి? వాళ్ళకు మన మెందుకు సలాములు చేయాలి", అంటూ తన మనసులోని ఆవేదనంతా వెళ్ళగ్రక్కింది ఆవేశంగా.

ఇది విన్న పరందామయ్య అవాక్కయిపోయాడు. కూతురు చెప్పింది, నిజమే కావచ్చు కానీ అది ఈనాడు ఆచరణలో సంభవం కాదు. కట్నం ఇస్తానంటేనే ఇన్ని వంకలు, ఇక ఇవ్వనంటే? ఆపైన ఆలోచించలేక పోయాడు.

కట్నంఇచ్చి పెళ్ళిచేసుకోవటం సుబ్బులుకి

Grams: "PULLICCAR"

Phone: 2259: Office
2871, 2872, 2873: PBX

# Pulliccar Mills Limited

Post Box No. 7
TIRUCHENGODE - 637 211.
(Salem District)

Manufacturers of:

Reputed quality 'Indian' & 'Foreign' Cotton yarn counts: 20s, 30s, 34s, 38s, 40s, 60s 80s and 100s in Hanks and Cones & Doubling for domestic & Export purposes, and--

All types of Cloth in Sheeting, Casement, Combric, Long Cloth, Drill & Sateen our Special Manufacturing Polyester vaieties are 'Bachelor' Shirtings 'Bullion' Shirtings & Suitings.

★ Spindleage: 31136 ★ Doubling: 2800 ★ Automatic Looms: 250

"PULLICCAR" A name renowned for quality over three decades.

(16 పేజీ తరువాయి)

అసలిష్టంలేదు "ఎందుకివ్వాలి? వాళ్ళకన్నా మేం ఎందులో తక్కువ? వాళ్ళు బయట పని చేస్తే, మేం ఇంట్లో పనిచేస్తాం. పైగా వాళ్ళ వంశం నిలబెట్టటం కోసం ఎన్నో బాధలుపడి, ఒక్కోసారి ప్రాణాల సైతం పణంగా పెట్టి పిల్లలకి జన్మనిస్తాం, వివాహవ్యవస్థకు ఇద్దరూ సమాన మైనప్పుడు కట్నం ఎందుకివ్వాలి?" అన్నదే సుబ్బులుకి అర్థంకాని విషయం. ఈ విషయమే తరచు తండ్రితో వాదించేది. ఎటొచ్చీ సుబ్బులి ఆదర్శభావాలన్ని, ఆచరణలో పూజ్యం అయిపోతున్నాయి. కారణం? అశక్తత ఆదర్శ భావాల్ని అణిచేస్తోంది.

ఇదిలా వుండగా ఓరోజు వురుములేని పిడుగులాగ పెళ్ళికొడుకు వూడిపడ్డాడు. పడ్డం సుబ్బుల్ని మెచ్చడం, వెనువెంటనే కట్నం బేరం మొదలవ్వటం త్వరత్వరగా జరిగిపోయాయి. పిల్లాడి పేరు అప్పారావు, అందగాడేం కాడు. ఆరడుగులవాడు అసలే లేడు, అందుకనే సుబ్బులికి అసంతృప్తిగా వుంది. కానీ పరిస్థితిని అర్థం చేసుకొని తల వూపింది. కట్నం బేరం మొదలయ్యింది. పిల్లాడి తండ్రి నాంచారయ్య పాతికన్నాడు (వేలు సుమండీ) పరందామయ్య పది అన్నాడు. పాతిక్కీ పదికి నక్కకీ-నాగలోకానికి వున్నంత తేడావుందని వుత్తరీయం సర్దుకొని చెప్పులకోసం చూశాడు నాంచారయ్య. అతని వైఖరి కనిపెట్టిన, పరందామయ్య మిత్రులు, శ్రేయోభిలాషులు, పెద్ద మనుషులు పదిహేనుకి పెంచారు. కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు నాంచారయ్య, పరందామయ్య చిన్ననాటి స్నేహితుడైన దర్మారావు అయిదువేలు నే సర్దుతాలే తరువాత నెమ్మదిగా ఇద్దువుగానీ ఇరవైకి పెంచమని బలవంతం చేసి ఇరవైకి పెంచారు. పిల్లాడి తండ్రి మొహం దీపావళినాటి చిచ్చుబుడ్డిలా వెలిగింది. కానీ బెట్టుగా ఇరవై అయిదే అన్నాడు. అందరు ఎంతో, ఎన్నోవిధాల చెప్పగా, మీ సంప్రదాయం మాకెంతో నచ్చింది కాబట్టే ఇరవై అయినా ఒప్పుకుంటున్నా అని తన ఉదార బుద్దిని ప్రకటించి, పెళ్ళిరోజు నిర్ణయించుకొని వెళ్ళిపోయారు.

♦ ♦ ♦

రంగురంగుల బల్బులతో పెళ్ళిపందిరి కళకళలాడుతోంది. పెళ్ళికొడుకు వేషంలో అప్పారావ్ పరవాలేదని అనిపిస్తున్నాడు. బజంత్రీలు బాజాలను ఎడాపెడా బాదేస్తున్నారు. మంత్రాలు వినపడాలనే తపనలో పురోహితుడు గొంతు చించుకుంటున్నాడు, సుబ్బులొచ్చేసింది. తాళికట్టే సమయం ఆసన్నమయింది. పెళ్ళికొడుకు పసుపుతాడు చేతిలోకి తీసుకున్నాడు ఒక్కసారి వాళ్ళ నాన్నవంక చూశాడు కట్టమంటావా అన్నట్టు (వాళ్ళ నాన్నకి కాదు పెళ్ళికూతురికి). వాళ్ళనాన్న హడావుడిగా లేచి తాళి కట్టవద్దన్నట్లు కుమారరత్నానికి కళ్ళతోనే సైగాచేసి వళ్ళంతా కళ్ళు చేసుకొని పరందామయ్య కోసం పందిరంతా కలయ చూశాడు. ఎక్కడా కనపడక గాబరా పడ్డాడు.

పెళ్ళికి వచ్చినందరికి రాత్రి రెండు కావటం ఆవలింతలు ముంచుకొస్తున్నాయి. "ఇంకా తాళి కట్టడేం పెళ్ళికొడుకు! తొందరగా తాళి కడితేచాలు అక్షతలు చల్లి ఆశీర్వదించి వెళదాం" అని వాళ్ళంతా ఎదురు చూస్తున్నారు. అప్పారావుకి మాత్రం (ఇరవై వేలు కళ్ళలో మెదులుతున్నాయో ఏమోగానీ) కళ్ళు

# "SELEKT"

**Motors and pumps**

IS : 325



For :- EFFICIANCY, ECONOMY AND TROUBLE FREE SERVICE




Manufactured by :

## CHITRA INDUSTRIES

COIMBATORE - 641 005.

Grams : "SELECT PUMP" Phone: 44548

—: సేల్స్ బ్రాంచ్ :—

## చిత్రా ఇండస్ట్రీస్

5-1-446, రాణిగంజ్

సికిందరాబాద్-3 (ఎ.పి.) ఫోన్ : 77826

డిస్ట్రిబ్యూటర్స్ :

## లక్ష్మీ ఏజెన్సీస్

రాణిగంజ్ :: సికిందరాబాద్-3.


మూత పడ్డం లేదు. పసుపుతాడుకి పసుపు సరిగా పూశారా లేదా అన్న విషయం పరిశీలిస్తున్నట్లు దీక్షగా దాని వంకే చూస్తూ నిల్చున్నాడు.

పందిరంతా వెదికి వెదికి ఆఖరుకి వాకిలి బయట పరందామయ్యగార్ని పట్టుకున్నాడు. అప్పారావ్ తండ్రి నాంచారయ్యని చూడ్డంతోనే విషయం గ్రహించిన పరందామయ్య, "నా స్నేహితుడు డబ్బు పెళ్ళికివచ్చేటప్పుడు తెస్తానన్నాడు ఇంతవరకు రాలేదు, వాడికోసమే ఎదురు చూస్తున్నా" నన్నాడు.

కల్లుత్రాగిన కోతిలా అయ్యాడు నాంచారయ్య "ఇలాంటి నాటకాలెన్నో చూశాం. తరువాత ఆ ఐదువేలు ఎగ్గెయ్యటానికేగా? ఈ కల్లబొల్లి కబుర్లు ఎవరికి తెలియదు" అంటూ తాటిచెట్టంత ఎత్తు ఎగిరాడు. "ఇవి చేతులు కావు కాళ్ళనుకోండి పెళ్ళి ఆపకండని" నాంచారయ్య చేతులు పట్టుకున్నాడు పరందామయ్య. "చాలు చాల్లే వయ్యా, ఇవి చేతులు గాక కాళ్ళయితే నన్నోవింత మనిషికింద జమకట్టి మ్యూజియంలో పెడతారని గొంతుచించుకొని, ఒరే అప్పాలూ! "తాళక్కడ పడేసి వచ్చేయ్" అన్నాడు వెళడానికి సిద్ధమవుతూన్న "వెళతావా?" అన్నట్లు సుబ్బులు అప్పారావ్ వంకచూసింది అదేం గమనించని, అప్పారావ్ తండ్రి మాటలు ఆలకించి పసుపుతాడు-సుబ్బుల్ని, వదిలేసి, తండ్రి దగ్గరకొచ్చాడు.

సుబ్బులు కళ్ళు చెరువయ్యాయి దుఃఖం కట్టలు తెంచుకుంటుంటే ఆపుకోలేక పీటల మీదనుండి గదిలోకి పరిగెత్తి ఆపద్బాంధవుడయిన తలగడని ఆశ్రయించింది. అంతలో హీరో, చచ్చిచెడి పారిపోయేవిలన్ని పట్టుకొన్నాక పోలీసులొచ్చినట్లు, ఎవరూ వూహిం

చని విధంగా దర్మారావ్ వచ్చేసాడు పరిస్థితిని గ్రహించి గబగబా సూట్ కేస్ (వట్టిదిలేదు సుమా ఐదు వేలున్నాయి అందులో) అందిచాడు ట్రైన్ లేటవటంవలన రావటం ఆలస్యం అయిందని సంజాయిషి ఇచ్చుకొని పరిస్థితి చక్కదిద్దాడు (ఆయనదిద్దేదేముంది లెండి అయిదువేలు చూడగానే అందరూ సర్దుకు కూర్చున్నారు) ఇహ నాంచారయ్య మొహం అరవై క్యాండిల్ బల్బులా వెలగ్గా "ఒరే అప్పులు గభాలున పోయి కూర్చోరా, ముహూర్తం దాటుతోందని, హెచ్చరించేసరికి దడుచుకున్న అప్పారావ్ పరిగత్తికెళ్ళి పీటలమీద కూర్చున్నాడు.

పరందామయ్యగారు పదిహేను వేలు, అయిదు వేలు గదిలో పెట్టి ఎవరో పిలవడంతో హడావుడిగా బయటకెళ్ళాడు. అప్పటి వరకు అక్కడే మంచంమీద ఏడుస్తూ, ఆలోచిస్తూ పడుకున్న సుబ్బులుకి ఆ డబ్బు చూడగానే "కోరికలే గుర్రాలయితె" సినిమాలో ప్రభ పెళ్ళి సీన్ గుర్తొచ్చింది. అంతే గభాలున కళ్ళు తుడుచుకొని, నోట్లకట్టలన్నీ ఓ పెద్ద పళ్ళెంలో పెట్టుకుని నిల్చుంది. పెళ్ళికూతుర్ని తీసుకు రమ్మన్న పిలుపు వినగానే పళ్ళెం పట్టుకొని, పెళ్ళి మంటపం దగ్గర కొచ్చింది. సూటిగా పెళ్ళి కొడుకువంక చూసి "ఒక్కసారి లేస్తావా మిస్టర్ అప్పారావు?" అంది గంభీరంగా.

అప్పారావు ఆశ్చర్యపోయాడు, పంచెగానీ వూడలేదు కదా అని ఒక్కసారి చూసుకుని లేచి నిల్చున్నాడు.

"చదువుకున్నావు, వుద్యోగం వెలగబెడుతున్నావ్, కట్నం తీసుకుని ఇంకోళ్ళకి అమ్ముడు పోవడానికి నీకెలా మనస్కరించింది? పోని తండ్రికి కట్నంకావలసివచ్చి, తీసుకుంటున్నావనుకున్నా ఐదువేలు తగ్గితే సర్ది చెప్పాల్సింది పోయి, పీటల మీద నుండి లేచి వెళతావా? అంటే నీక్కావలసింది కట్నమే కాని నీ సుఖ దుఃఖాలలో భాగం పంచుకొనే భార్య కాదన్న మాట, ఆ డబ్బుకే తాళికట్టి, దాంతోనే కాపరం చేస్తావా?" ఇలాంటి కిరాతకుణ్ణి నేను డబ్బిచ్చి కొనుక్కోదలచలేదు. మా కుటుంబాన్ని, నన్ను పూర్తిగా అర్థం చేసుకునే వ్యక్తి కట్నాన్ని ద్వేషించే వ్యక్తి ఎవరైనా దొరికితే సరే, లేకపోతే ఈ 20 వేలు పెట్టుబడితో ఓ చక్కని వ్యాపారం చేసుకుంటూ జీవితాంతం చక్కగా బ్రతుకుతాను. ఇక మీరంతా తిరిగి చూడకుండా వెళ్ళొచ్చు, అని ఆవేశంతో అరిచేటప్పటికి వచ్చిన వాళ్ళంతా ఒకొక్కరే జారుకున్నారు.

★

## — మనదేశం —

సరుకుల కొరత
ఉద్యోగాలు కరువు
జీతాలు చాలక సమ్మెలు
నాయకత్వానికై పెనుగులాటలు
పదవులకై పార్టీమార్పిళ్ళు
వ్యాపారుల 'చీకటిబజారు'
పదార్థాలలో కల్తీ
మాన భంగాల విజృంభణ
వెరసి మన భారతదేశం
మార్పురాలేని అప్పుల దేశం

— బచ్చువీర్రాజు.